

గండికోట ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆది తదితరులు

సమస్యల తిష్ట

● నేడు రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధి, సమస్యలపై కీలక సమావేశం



కడప శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ రోగులకు సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం జరగనున్న హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇవీ సమస్యలు..

● రిమ్స్ ఆసుపత్రి నగరానికి దూరంలో ఉండడంతో రోగులు, వారివెంట వచ్చే సహాయకులు ప్రయాణ సమస్యలు ఎదుర్కొంటున్నారు. రిమ్స్ వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది.

● ఆసుపత్రి ప్రాంగణంలో మరుగుదొడ్ల కొరతతో మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.

● రిమ్స్ ఆవరణలో రోడ్లు గుంతలతో, బురదతో నిండిపోయాయి. రాత్రివేళ లైటింగ్ సదుపాయం లేక రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

● వార్డులలో, రిమ్స్ ప్రాంగణంలో తాగునీటి సదుపాయం సరిగా లేదని రోగులు వాపోతున్నారు.

● మాతా-శిశు ఆరోగ్య సేవలకోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న ఎంసీహెచ్ బ్లాక్ పనులు నత్తనడకలా సాగుతున్నాయి.

● పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నెల నుంచి పలుమార్లు ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన ధర్నాకు దిగారు. దీని వల్ల రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

● సంపుల నిర్వహణ సరిగా లేదు. నీటిలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉండటంతో పైపుల్లో నీరు సరిగా రావడం లేదు. పలు వార్డులకు, అధికారుల రూములకు సైతం నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు.

● ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ సేఫ్టీ వ్యవస్థ నిర్వహణ కూడా సక్రమంగా లేదు.

● రోగుల పట్ల సిబ్బంది ప్రవర్తిస్తున్న వైఖరి సరిగా లేదని పలుమార్లు ఫిర్యాలు అందాయి.

● రోగులను పలుమార్లు తిప్పించుకోకుండా వీలైంత తొందరగా వైద్య చికిత్స అందించాల్సి ఉంది. సీటీ, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ లాంటి స్కానింగ్ కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

● భద్రతా వ్యవస్థ సరిగా లేదు. ఆకతాయిలు రాత్రి సమయాలలో ఆసుపత్రి ప్రాంగణంలోనే నిద్రిస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఈ సమావేశానికి పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో వీటన్నింటిపై చర్చజరిపి ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని రోగులు ప్రజలు కోరుకుంటున్నారు.

సంపుతాది..!

రిమ్స్‌లో రోగుల ప్రాణాలకు అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం ఆసుపత్రికి వేల మంది చికిత్సకు వస్తుంటారు. ఆసుపత్రిలో, ఇతర భవన సముదాయాలకు నీటిని సరఫరా చేసేందుకు నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యంతో పంప్‌హౌస్‌ను నిర్మించారు. దీని మ్యాన్‌హోల్స్‌కు మూతలు లేవు. పంప్‌హౌస్ చుట్టూ రక్షణ గోడ లేదు. దీంతో ఎవరైనా పిల్లలు పొరపాటున అందులో పడితే కనుక్కోవడం కూడా కష్టమవుతుంది. మ్యాన్‌హోల్స్‌కు మూతలు లేకపోవడంతో ఇందులో చెత్తా చెదారం చేరి నీరు కలుషితం అవుతోంది.




రిమ్స్‌లో పంప్‌హౌస్ మ్యాన్‌హోల్‌కు మూత లేని దృశ్యం

పర్యాటకంగా అభివృద్ధికి ప్రణాళిక

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కొండాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి ఆయన గండికోట ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై అధికారులతో మాట్లాడారు. జమ్మలమడుగు నుంచి మైలవరం జలాశయం మీదుగా గండికోట ప్రాజెక్టు వరకు పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. మైలవరం జలాశయంలో ప్రస్తుతం హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్న దగ్గరి నుంచి గండికోట ప్రాజెక్టుకు చేరుకునేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారుల ను కలెక్టర్ ఆదేశించారు. మైలవరం నుంచి గండికోట ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ అందాలు తిలకించేందుకు వీలుగా ఉండాలని చెప్పారు. బోటింగ్, ప్రాజెక్టు సమీపంలో రిసార్టు ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని, గండికోట సొరంగాన్ని, గేట్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్టులో నీటిలభ్యతను అధికారులను అడిగి తెలుకున్నారు. గండికోట ముంపు సమస్యలు, ముంపు పరిహారం, పునరావాస కాలనీల్లో సౌకర్యాలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. అనంతరం వీరంతా కలసి తాళ్లప్రొద్దుటూరులో నూతన పోలీస్ స్టేషన్‌కు అనువైన స్థలంకోసం పరిశీలించారు. ప్రస్తుతం తాత్కలిక పోలీస్‌స్టేషన్ ఉన్న ప్రాంతంలోని 80 సెంట్ల స్థలాన్ని నిర్వాసిత కుటుంబాలకు కేటాయించాలని విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌కు మరొకచోట స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఈ కొండారెడ్డి, ఈఈ ఉమామహేశ్వర్లు, తహశీల్దార్ గురప్ప, సీఐ రాజా తదితరులు పాల్గొన్నారు.

సమైక్యత, సద్భావనకు ప్రతీక పెద్దదర్గా



కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వెలసిన ప్రఖ్యాత పెద్దదర్గా (అమీన్‌పీర్‌దర్గా) సమైక్యత, సద్భావనకు ఆదర్శంగా నిలుస్తోంది. దేశంలోని గొప్ప దర్గాలలో ఒకటిగా, దక్షణ భారత అజ్మీర్ దర్గాగా పేరుగాంచింది. నిత్యం వందలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. దర్గాలో అడుగుపెట్టిన ప్రతీ భక్తులూ తొలుత ప్రధాన గురువులైన ఖాజాయే ఖాజాగా ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మాలిక్ సాహెబ్ మజార్‌ను (సమాధిని) దర్శించుకుంటారు. తదుపరి ఆ ప్రాంగణంలోని హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేని సాహెబ్ మజార్‌తో పాటు ఆ వంశానికి చెందిన ఇతర గురువులందరి మజార్లను దర్శించుకుంటారు. పరిపూర్ణ భక్తివిశ్వాసాలతో పూలచాదర్ సమర్పించి ప్రార్థనలు చేస్తుంటారు. దూరప్రాంతాల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దర్గా గురువుల దర్శనాలకు పలుమార్లు వస్తుంటారు.

నేటి నుంచి ఉరుసు

పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం గంధం మహోత్సవంతో ప్రారంభం కానున్నాయి. ఈనెల 9వ తేదీ వరకూ ఐదు రోజులపాటు కొనసాగనున్నాయి. అందులో భాగంగా గురువారం ఉరుసు, శుక్రవారం ముషాయిరా, శనివారం ఖవ్వాలీ, ఆదివారం నగరంలో పీఠాధిపతి ఊరేగింపు అత్యంత వైభవోపేతంగా జరుగనుంది. ఉరుసు మహోత్సవాలకు దేశవ్యాప్తంగా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. పీఠాధిపతి ఊరేగింపుతో ఉరుసు మహోత్సవాలు ముగియనున్నాయి.

10న సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 10వ తేదీ ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ 227వ జయంతి వేడుకల్ని నిర్వహించనున్నట్లు వీసీ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. సీపీ బ్రౌన్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాహిత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భాషా శాస్త్ర శాఖ విశ్రాంత ప్రొఫెసర్ పరిమి రామనరసింహం హాజరై తెలుగు భాష ఔన్నత్యం అంశంపై ప్రసంగం చేస్తారని తెలిపారు. బ్రౌన్ గ్రంథాలయానికి సేవలందించిన, పుస్తకాలు బహూకరించిన వారిని ప్రత్యేకంగా గౌరవించనున్నామన్నారు.

బుకీల వేటలో ప్రొద్దుటూరు పోలీసులు

ప్రొద్దుటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న క్రికెట్ బెట్టింగ్‌ల గుట్టు రట్టు చేయడానికి ప్రొద్దుటూరు పోలీసులు చర్యలకు దిగారు. మూడు రోజులుగా డీఎస్పీ భావన నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు బడా క్రికెట్ బుకీల వేటలో ఉన్నాయి. ఇప్పటికే మైదుకూరు పోలీసు స్టేషన్లో పనిచేస్తున్న క్రైం కానిస్టేబుల్ పాత్రపై విచారణలో కొన్ని వాస్తవాలు నిగ్గు తేలాయి. ఈ బెట్టింగ్ వ్యవహారంలో మరో నలుగురు కానిస్టేబుల్స్ పాత్రపై కూడా ఆధారాలు లభించడంతో ప్రత్యేకంగా విచారణ జరుపుతున్నారు. సోమవారం రాత్రి దాదాపు 8 మంది క్రికెట్ బుకీలపై టూటౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వీరు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్నారు. వారితో పాటు మరో నలుగురు కీలక బుకీల కోసం బెంగళూరుకు ప్రత్యేక పోలీసు బృందం వెళ్లింది. కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాలలో కూడా విస్తృతంగా గాలింపు జరుపుతున్నారు. ఈ ఆపరేషన్‌తో గుట్టుగా ఉంటున్న బుకీలంతా ఒక్కసారిగా అలర్ట్ అయి తలదాచుకోవడానికి తలా ఒక దిక్కు పరారయ్యారని చెబుతున్నారు.

రూ.1.25 కోట్ల ఇసుక స్కాం

● విజిలెన్స్ విచారణలో నిర్ధారణ

● రెగ్యులర్ ఏఈని తప్పించి.. ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లపై కొరడా

● క్రిమినల్ కేసులు పెట్టి రికవరీకి ఉత్తర్వులు

● ఆంధ్రజ్యోతి కథనాలతో బయటపడ్డ స్కాం


ప్రొద్దుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ప్రొద్దుటూరులోని జగనన్న కాలనీల్లో పేదల గృహనిర్మాణాల కోసం తోలిన ఇసుకను హౌసింగ్ అధికారులు, సిబ్బంది కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి బొక్కేశారు. ఈ అక్రమాలపై 20 డిసెంబరు 2023లో 'జగనన్న కాలనీల్లో ఇసుకమేత' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని హౌసింగ్ అధికారులు విచారణ పేరిట ఆ స్కాంను అటకెక్కించేశారు. ఆతరువాత 2024 జూలై 4న 'జగనన్న ఇళ్ల నిర్మాణాలపేర రూ.2 కోట్ల ఇసుక స్కాం' అని ఆంధ్రజ్యోతిలో మళ్లీ కథనం ప్రచురితమైంది. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి సైతం ఇసుక స్కాంపై నిగ్గుతేల్చాలని హౌసింగ్ ఎండీకి ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్సు విచారణ చేపట్టింది. 13,678 టన్నుల ఇసుక మాయం అయిందని తేల్చింది. ఈ ఇసుక విలువ రూ.1.25 కోట్లుగా నిర్ధారించింది.

రెగ్యులర్ ఏఈని తప్పించి..

రూ.1.25 కోట్ల ఇసుక స్కాంలో అసలు సూత్రధారుడైన గోడౌన్ ఇన్‌చార్జ్, ఏఈ వెంకటేశ్వర్లుతో పాటు, ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇందిర, కుమారి, గుర్రప్పను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. కొన్ని నెలలు తరువాత ఆ ఏఈపై సస్పెన్షన్ ఎత్తేసి జిల్లాలోని చాపాడు మండలంలో తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ఇసుక లోడ్లు ఇండెంట్‌లు పెట్టి ఏ కాంట్రాక్టర్లకు ఇసుక తోలాలో జేపీ వెంచర్స్‌కు, ప్రతిమా కంపెనీకి అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చింది ఇతనే. విజిలెన్సు నివేదిక మేరకు హౌసింగ్ ఎండీ ఆదేశాలతో తాజాగా అక్టోబరు 17న జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం రెగ్యులర్ ఏఈ వెంకటేశ్వర్లును స్కాం నుంచి తప్పించి ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లను మాత్రం బాధ్యులను చేశారు. వాస్తవానికి వీరిని ఏడాది క్రితమే విధుల నుంచి తొలగించారు. బొల్లవరం లేఅవుట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇందిర 10,278 టన్నులకు రూ.94,04,900, రామేశ్వరం లేఅవుట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమారి 3,380 టన్నులకు రూ.30,93,570, మీనాపురం లేఅవుట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గుర్రప్ప 19.47 టన్నులకు రూ.17,815.. మొత్తం 13,678 టన్నులకు రూ.1,25,16,285 రికవరీ చేయాలని పీడీ రాజారత్నం ఆదేశాల మేరకు డీఈ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.1.25 కోట్లు చెల్లించకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో వర్క్ ఇన్‌స్పెక్టర్లు లబోదిబో మంటున్నారు. తమను కుట్రపూరితంగా రికార్డుల్లో ఇరికించి అసలు సూత్రధారులు తప్పించుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తమను అన్యాయంగా బలి చేశారంటున్న ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు



ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఇచ్చిన ఉత్తర్వు

కాంట్రాక్టర్, ఏఈ కుమ్మక్కై..

బొల్లవరం లేఅవుట్‌లో అప్పట్లో 3000 ఇళ్ల నిర్మాణం చేస్తున్న చాపాడు మండలం అయ్యవారిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ శేఖర్‌రెడ్డికే 10,000 వేల టన్నుల ఇసుకను నవంబరు 2023 నుంచి మార్చి 2024 వరకు తోలారని మాజీ బొల్లవరం వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇందిర ఆరోపిస్తున్నారు. ఇందుకు ఆఫీసులో ఉన్న రికార్డులే సాక్ష్యం అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నా ఇళ్ల నిర్మాణాలు నిలబడి పోయినా ఆ ఇసుకను ఎందుకు ఇండెంట్‌లు పెట్టి తెప్పించి ఆ కాంట్రాక్టర్‌కు చేర్చాడో ఏఈ వెంకటేశ్వర్లుకే తెలుసున్నారు. కాంట్రాక్టర్, ఏఈ కుమ్మక్కయి ఇసుకను మాయం చేసి ఆ నేరం తనపై మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారిస్తే ఇసుక స్కాంలో సూత్రధారులు ఎవరో తేలుతుందన్నారు. అందుకు అవసరమైన సాక్ష్యాలన్ని ఉన్నా డిపార్ట్‌మెంట్ పెద్దలు కప్పిపుచ్చి రెండు నెలల్లో రిటైర్ కానున్న ఏఈ వెంకటేశ్వర్లును కాపాడేందుకు తమ జీవితాలను బలిచేస్తున్నారన్నారు. రామేశ్వరం లేఅవుట్ లోనూ ఇళ్ల నిర్మాణం జరగకనే 3380 టన్నుల ఇసుక ఎలా మాయమైందో ఏఈ వెంకటేశ్వర్లుకు మాత్రమే తెలుసన్నారు.

కలెక్టర్ విచారణ జరపాలి

ఈ స్కాంలో అసలు నిందితుడైన రెగ్యులర్ ఏఈ వెంకటేశ్వర్లును వదిలిపెట్టి తాత్కాలిక ఉద్యోగులైన తమను బలిచేయడంపై న్యాయపోరాటం చేస్తామని ఇందిర, కుమారి, గుర్రప్ప తెలిపారు.. ఏఈ వెంకటేశ్వర్లు ఇప్పటికి డిపార్టుమెంటులో ఎన్నిసార్లు సస్పెండ్ అయ్యాడో, పనిష్‌మెంట్ కింద అతన్ని ఎంతదూరం ట్రాన్స్‌ఫర్ చేశారో ప్రజలకు తెలుసన్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, హౌసింగ్ ఎండీ, అధికారులు ఇప్పటికైనా వాస్తవాలు పరిశీలించాలని వేడుకుంటున్నారు. లేదంటే తమకు చావే శరణ్యమని బాధితులు అంటున్నారు.

ఖాళీ అవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి

● ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న యంత్రాలు

పులివెందుల రూరల్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి ఖాళీ అవుతోంది. 350 బెడ్లతో రోగులకు వైద్యసేవలందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఇకపై పేదలకు ఉచిత వైద్యం అందుతుం దా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వివరాలోకెళితే..

ఇక్కడి మెడికల్‌కళాశాల నిర్వహణకు అవసరమైన సామాగ్రి, యంత్రాలు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమకూర్చారు. అయితే మెడికల్ కళాశాల భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగిపోయింది. పేదలకు మరింత నాణ్యమైన వైద్యం అందించేలా అన్ని చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం చెబుతూ పీ-4 పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో ఆసుపత్రిలోని సామాగ్రి, యంత్రాలను రాష్ట్రంలోని వివిధ జీజీహెచ్‌లకు తరలిస్తున్నట్లు తెలిసింది. ఆపరేషన్ థియేటర్‌లోని సామాగ్రి, స్కానింగ్ లాంటి యంత్రాలు కూడా తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై సూపరింటెండెంట్ శ్రీనివాసులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరలింపు జరుగుతోందన్నారు. అన్నీ తీసుకెళ్లకుండా కొన్నైనా ఇక్కడ ఉంచాలని ఉన్నతాధికారుల ను కోరుతున్నామన్నారు.



పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తరలిపోతున్న సామగ్రి, యంత్రాలు

కక్షా రాజకీయాలకు దూరంగా పాలన

● ప్రతీకార రాజకీయాలకు చంద్రబాబు వ్యతిరేకం
● కష్టపడి పనిచేస్తే మళ్లీ అధికారంలోకి వస్తాం
● జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రాయచోటి - నేతాజీ సర్కిల్ , నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కక్ష పూరిత రాజకీయాలకు దూరంగా ప్రభుత్వ పాలన సాగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో రాయచోటి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసులు పెట్టించుకున్నాం. జైళ్లకు వెళ్లాం. కష్టాలు, ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నామన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చట్టం పరిధిలోనే పోరాడుదామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు పార్టీ కోసం కష్టపడిన వారు అధికారం వచ్చాక తగిన గుర్తింపు కోరుకోవడం సహజమని, అలాంటి వారిని పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. కొంత ఆలస్యం కావచ్చు తప్ప.. అందరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలియజేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన 90 శాతం పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో అభివృద్ధిని తీసుకొచ్చాం. పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు వస్తేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడవలు, బల ప్రదర్శన కంటే, సంక్షేమకార్యక్రమాలు, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. రామ్‌గోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేసిన సమయంలో అప్పటి అధికార పక్షం చేసిన తప్పులను ప్రజల ముందు ఉంచడం ద్వారానే విజయం సాధించినట్లు తెలిపారు. ప్రతిపక్షం మాదిరిగా మనకు సొంత చానల్, పత్రిక లేవన్నారు. కార్యకర్తల ద్వారా మౌత్ పబ్లిసిటీ ద్వారానే ప్రజల్లోకి మనం చేసిన కార్యక్రమాలు తీసుకెళ్లాలన్నారు. తెలుగుదేశం పార్టీలోకి ఎంత పెద్ద నాయకులు వచ్చినా, పోయినా, కేవలం క్షేత్రస్థాయి కార్యకర్తలు మాత్రమే శాశ్వతం అన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రతిపక్షంలో డైనమిక్‌గా ఉండటంతో పాటు పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పోరాటం చేసిన వ్యక్తి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించే విధంగా పనిచేయాలన్నారు.

స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

డీఆర్సీ సమావేశానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో స్వాగతం పలికారు. అనంతరం స్టేట్ గెస్ట్ హౌస్‌లో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

డ్రైవింగ్ శిక్షణకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ కోసం అన్నమయ్య జిల్లా అభ్యర్థులకు కడపలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జీవనోపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ మోటరువాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 12 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఎటువంటి పారితోషికం ఉండదన్నారు. శిక్షణ ఇచ్చినందుకు అభ్యర్థి తరఫున ప్రభుత్వం ఆర్టీసీ రూ.20 వేలు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు సుబ్బరాయుడు, ప్రజా ట్రాన్స్‌పోర్టు శాఖ (ఆర్టీసీ) అధికారి బాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాకిన మత్తు.. !

● కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

గుర్రంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ హైస్కూల్ విద్యార్థులు మత్తు పదార్థాలతో హెచ్‌ఎంకు పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆరుగురు టెన్త్ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాలు సేవిస్తుండగా ప్రధానోపాధ్యాయుడు వారిని పట్టుకున్నారు. కార్యాలయంలోకి పిలిపించుకుని విచారణ చేయగా, తాము గంజాయిని సేవించలేదని, సొల్యూషన్ వాడినట్లు తెలిపారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా, అప్పటికే సాయంత్రం కావడంతో పోలీసులు మరుసటి రోజు రావాలంటూ ఇళ్లకు పంపేశారు. నాలుగు నెలల క్రితం కూడా ఇదే ప్రాంగణంలో ఓ విద్యార్థి మత్తు పదార్థాలను సేవిస్తూ ఉపాధ్యాయులకు పట్టుబడ్డాడు. అప్పట్లో విషయం బయటకు రాకుండా నొక్కిపెట్టారు. కాగా, మంగళవారం పోలీసులు, హెచ్‌ఎం కలిసి విద్యార్థులకు మత్తు పదార్థాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ విషయమై ఏఎస్‌ఐ బొజ్జినాయక్ వివరణ కోరగా హెచ్‌ఎం తీసుకొచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. తల్లిదండ్రులను తీసుకురావాలని విద్యార్థులకు చెప్పి పంపాము. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులకు తెలిపి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

రాజంపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన కార్తికేయరాజు(32) అనే వ్యక్తి విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కార్తికేయరాజు రాజంపేట పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తుంటాడు. సోమవారం రాత్రి ఊటుకూరు పొలాల్లో విషం తాగాడు, అపస్మారక స్థితిలో ఉన్న కార్తికేయరాజును గుర్తించిన స్నేహితులు, స్థానికులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్థిక కారణాలే అతని ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు. రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

మద్యం దుకాణంలో యువకుడి మృతి



నరేశ్ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగుతూ.. నరేశ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని పోతులప్ప వీధికి చెందిన నాగరాజు, పద్మజ దంపతుల కు మారుడు నరేశ్ సెంట్రింగ్ పనులు చేసేవాడు. మద్యానికి బానిసైన ఇతను మంగళవారం పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగుతూ అక్కడే పడి పోయాడు. ఎంత సేపటికీ అతను కదలక పోవడం గమనించిన స్థాని కులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి తమ బృందం తో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నా భర్త మృతి అనుమానాస్పదం


● ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు ● పోస్టుమార్టంకు డిమాండ్



మృతుడి భార్య శ్రీదేవితో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

రాయచోటి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భర్త మృతదేహాన్ని భార్యకు చూపకుండానే బంధువులు అంత్యక్రియలు నిర్వహించ డంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్, జి ల్లా సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్ అన్నారు. పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలం నూతన కాల్వ పంచాయతీ దేవవాండ్ల పల్లెకు చెందిన దేరంగుల ఆంజనేయులు (28) భార్య ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లింది. మూడు రోజుల క్రితం భర్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందడంతో ఈ నెల 2న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని భార్య శ్రీదేవి అతనిని చూసేందుకు గ్రామానికి వచ్చింది. అయితే, అప్పటికే ఆంజ నేయులు మృతి చెందడంతో అంత్యక్రియలకుసిద్ధం చేసిన బంధు వులు మృతదేహాన్ని చూసేందుకు సైతం ఆమెను అనుమతించలేదు. ఈ విషయంపై ఆమె సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మంగళ వారం పౌరహక్కుల నాయకులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయులు మృతిపై అను మానాలు వ్యక్తమవుతున్నందున పోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా కీడా జట్ల ఎంపిక



చెస్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలిక జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అండర్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, అథ్లెటిక్స్, అండర్ 14, 17, 19 చెస్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ కనపర్చిన వారిని ఎంపిక చేశారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో అండర్ 14, 17, 19 చెస్ చాంపియన్‌షిప్ పోటీలో ఈ జట్లు పాల్గొంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ తెలిపారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు అన్సర్, అంజనప్ప, దిలీప్, భారతి, సుధాకర్, మోహన్, కరేశ్, కిరణ్, మురళీధర్, హరి, లత, వరలక్ష్మి, డివిజన్ స్థాయి కో-ఆర్డినేటర్స్ భద్రయ్య, సుధాకర్,బాటాజీ, దేవకమ్మలు పాల్గొన్నారు.

నదుల వద్ద జాగ్రత్తగా ఉండాలి

● దేవాలయాల్లో క్యూలైన్ పాటించాలి ● ప్రజలకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచన

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నమయ్య జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం ఒకప్రకటనలో కోరారు. నదీ స్నానాలు, దేవాలయాల సందర్శనల విషయంలో భక్తులు తప్పక పాటించాల్సిన నియమాలను ఎస్పీ విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా నదుల్లో ప్రవాహం ఉధృతంగా ఉందని, లోతు తక్కువ ఉన్న సురక్షిత ప్రాంతంలోనే స్నానం చేయాలన్నారు. సుడులు, ప్రమాదకర లోతు ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. మహిళలు, భక్తులు ఒడ్డున నిలబడి మాత్రమే దీపాలు వదలాలని, గట్టు జారే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా నడవాలన్నారు. పిల్లలను ఒక్క క్షణం కూడా ఒంటరిగా వదలవద్దని, వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు నిశితంగా గమనించాలన్నారు. నదులు, దేవాలయాల వద్ద మీ భద్రత కోసం ఉన్న పోలీసుల సూచనలను తప్పక పాటించాలన్నారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్రమశిక్షణతో క్యూలైన్లలో మాత్రమే వెళ్లాలని, గుంపులుగా వెళ్లవద్దన్నారు. పూజలు నిర్వహించే సమయంలో షార్ట్ సర్క్యూట్‌లు, దీపాల వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఇసుక, నీటిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

గైడ్ కెప్టెన్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలపై ఇచ్చే శిక్షణను గైడ్ కెప్టెన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం సూచించారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన బేసిక్ గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం స్కౌట్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై విద్యార్థులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, సేవా భావాన్ని, నైతిక విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ సుజాత, జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన 55 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం



ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం

మదనపల్లె టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రొఖియా బేగం తెలిపారు. మంగళవారం మదనపల్లెకు వచ్చిన ఆమె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పౌష్టికాహారం నివేదికలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాల వివరాలను మహిళా కమిషన్‌కు పంపాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లతో పలు అంశాలను చర్చించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగవేణి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు సమాజంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే ధైర్యంగా టోల్‌ఫ్రీ నెంబర్‌కు, శక్తియాప్ ద్వారా పోలీసులకు తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం చంద్రాకాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాలలో కూరలను పరిశీలించారు. కోడిగుడ్ల బండి వద్ద విద్యార్థినులు ఉండటాన్ని చూసి ప్రిన్సిపాల్ మల్లీశ్వరిని ప్రశ్నించారు. స్కూల్ కమిటీలో విద్యార్థినులు సభ్యులుగా ఉన్నారని, అందుకే 8, 9 తరగతులు విద్యార్థినులు కోడిగుడ్ల లెక్కలను సరి చూస్తున్నారని అక్కడి అధ్యాపకులు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య, క్రీడల్లో ప్రోత్సాహం ఇవ్వాలని మహిళా కమిషన్ సభ్యురాలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వచ్చి మృత్యువాత..

● ఆందోళనతో గుండెపోటుకు గురై వృద్ధుడి మృతి



చంద్రారెడ్డి మృతదేహం

పీలేరు, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): భూతగాదాల నేపథ్యంలో న్యాయం కోసం పోలీసు స్టేషన్, తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన కూరపర్తివారిపల్లెకు చెందిన ఇట్లం చంద్రారెడ్డి(70) అనే వృద్ధుడు పోలీసు స్టేషన్ ఎదుటే మృత్యువాతపడిన సంఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు వెంకటేశ్వరరెడ్డి కథనం మేరకు .. చంద్రారెడ్డి కుటుంబానికి రేగళ్ల పంచాయతీ పరిధిలోని సర్వే నెం 284లో 2.96 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విషయంలో శెట్టిపల్లె హరిజనవాడకు చెందిన గంగారపు గంగయ్య, గంగారపు వెంకటేశు మధ్య వ్యాజ్యం నడవగా, పీలేరు సివిలల్‌జడ్జి కోర్టు చంద్రారెడ్డి కుటుంబానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత నెల29, 30 తేదీల్లో తమ పొలంలో ఉలవలు చల్లేందుకు ప్రత్యర్థులు చేసిన ప్రయత్నాలను అడ్డుకుని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో విచారణ నిమిత్తం మంగళవారం పోలీసు స్టేషన్ వద్దకు వస్తున్న చంద్రారెడ్డి, కుటుంబ సభ్యులపై ఎదుటి వర్గం వారు దౌర్జన్యం చేశారు. దీంతో ఆందోళనకు గురైన తన తండ్రి కుప్పకూలిపోయాడని, వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంకటేశ్వరరెడ్డి మంగళవారం సాయంత్రం తన ఫిర్యాదు వాపసు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి

గండి క్షేత్రంలో ప్రత్యక్షం

● సోషల్ మీడియా చిత్రాల ఆధారంగా గుర్తించిన భక్తులు



విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె/రాయచోటి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మందలిస్తారనే భయంతో నాలుగు రోజుల క్రితం తంబళ్లపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. . అక్టోబరు 31 తెల్లవారుజామునుంచి విద్యార్థి కనిపించడం లేదంటూ తల్లితండ్రుల ఫిర్యాదు చేయడంలో తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలతో గాలించడంతోపాటు, సీసీ కెమెరాల ఫుటేజీల పరిశీలన, విద్యార్థి ఫొటోలతో కూడిన కరపత్రాలను సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. మంగళవారం కడప జిల్లా వేంపల్లి గండి ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లిన ఓ భక్తుడు సామాజిక మాధ్యమంలో చూసిన పోలికలతో ఓ బాలుడు ఆలయం వద్ద ఒంటరిగా తిరుగుతుండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థి చరణ్‌ను సురక్షితంగా పట్టుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలి

● పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ విజయభాస్కర్



చూడి ఆవుకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలని రాజంపేట పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేఆర్‌కండ్రికలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 253 పశువులకు గాను చూడి, సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దూడలకు నట్టల నివారణ మందుల వేశామన్నారు. పిడుదుల మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కేఆర్‌కండ్రిక, అమ్మిశెట్టిపల్లె, చియ్యవరం, కమ్మపల్లె, నడింపల్లె, వెంకటరెడ్డిపల్లె తదితర గ్రామాలకు చెందిన 55 మంది పాడి రైతులకు రూ. 20 వేలు విలువ చేసే మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, కడప పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ శివరామిరెడ్డి, పశువైద్యులు దుర్గానాగమ్మ, డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ నాగశిరీషా, డాక్టర్ సృజన, పాడి రైతులు శ్రీనివాసరాజు, మద్దిన గిరిబాబు, మండల పశుసంవర్ధక శాఖ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రైల్వేకోడూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 1, 2 తేదీల్లో ఏలూరు లోని శనివారంపేట హైస్కూలు మైదానంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో రైల్వేకోడూరు జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థిని అఖిల బంగారు పతకాన్ని సాధించి, జాతీ య స్థాయి పోటీలకు ఎంపిక కాగా, మంగంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి ఏ. రామ్‌చరణ్ కాంస్య పతకాన్ని సాధించాడని ఎస్వీకే స్పోర్ట్స్ అకాడమి కోచ్ శివాజీ తెలిపారు. అఖిల ఈ నెల 25న అరుణాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



తరగతి గదిలో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

సుండుపల్లె, నవంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న త లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని జేడీఏ శివనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని రాయవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, వసతులు, విద్యార్థుల సమస్యలు , 9, 10 తరగతుల సిలబస్ ఏ మేరకు పూర్తి చేశారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని, అందుకు అనుగుణంగా రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. యూనిట్ టెస్టులు, వాటి ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అమృనాయక్ పాల్గొన్నారు.


నిధులు తెచ్చుకోవడంలో ప్రభుత్వం విఫలం

● తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంలో కూటమి ప్రభుత్వం, గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. రాజధాని నిర్మాణం పేరుతో విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చవద్దని ముఖ్యమంత్రికి ఆయన సూచించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నోమార్లు చెప్పారన్నారు. కానీ ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం రూ.31వేల కోట్లు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో నుంచి, జర్మనీ బ్యాంకు ద్వారా అప్పు చేశారన్నారు. ఇవి కాకుండా మరో రూ.32,500 కోట్లు అప్పు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం అప్పులు చేయడం మానుకుని కేంద్రప్రభుత్వం ఆర్థిక సహాయం, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో నిర్మించాలని ఆయన సూచించారు.

హార్సిలీహిల్స్‌లో హాయి హాయిగా...

● కొండను కమ్మేసిన పొగమంచు ● పర్యాటకులకు కనువిందు



పొగమంచులో హరిత రెస్టారెంట్ ప్రాంగణం

బి.కొత్తకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌లో మంగళవారం నాటి దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేశాయి. సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న హిల్‌స్టేషన్ కావడంతో సహజంగానే చల్లనిగాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడే సూచనలుంటే కొండంతా పొగమంచు కమ్ముకుంటుంది. సమీపంలోని మనుషులు, ప్రదేశాలు కనపడనంతగా పొగమంచు ఆవరిస్తుంది. మంగళవారం ఇలాంటి వాతావరణం కొండమీద కనిపించింది. దీంతో కొండపైకి వచ్చిన పర్యాటకులు మంచును, వణికించే చలిని ఆస్వాదిస్తూ గడిపారు. గాలిబండ, కొత్తవ్యూపాయింట్ నుంచి దిగువ ప్రాంతాలు కనపడనంతగా కమ్మేసిన పొగ మంచులో ప్రకృతి అందాలను కెమెరాలలో బంధించారు. చక్కటి అనుభూతిని పొందుతూ కొండపై కలియ తిరిగారు.



దిగువప్రాంతం ఏరియల్ వ్యూపాయింట్

గుడిపాడు వద్ద వేరుశనగ పొలంలో నిలిచిన వర్షపునీరు



నెల రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. మొన్నటి వరకు మొంథా తుఫాను ధాటికి రైతులు విలవిల్లాడారు. ఇప్పుడిప్పుడే ఊపిరి తీసుకుంటున్న పరిస్థితుల్లో తిరిగి వర్షాలు పడుతుండడంతో వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పంటలన్నీ కోత దశకు వచ్చి నూర్పిళ్లు జరుగుతున్న తరుణంలో వర్షాలు పడడంతో చేతికి వచ్చిన పంటలు పొలాల్లోనే దెబ్బతింటున్నాయని తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.

ఎడతెరిపి లేని వర్షం... తీరని నష్టం



రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు



నీరు తొలగించేందుకు రైతు పాట్లు

దువ్వూరు/రాజుపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు, రాజుపాళెం మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, మినుము, వరి, పత్తి, కంది, వేరుశనగ, పసుపు, ఉల్లి తదితర పంటలను రైతులు సాగు చేశారు. దాదాపు నెల రోజులు ప్రతి రోజు వర్షం పడుతుండడంతో పంటలు సాగు చేసిన పొలాల్లో తేమ శాతం ఎక్కువై పురుగుల బెడదతో పాటు తెగుళ్లు చుట్టుముట్టాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతు న్నారు. ఉల్లి రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. చాలా గ్రామాల్లో వర్షానికి తోడు ధర లేకపోవడంతో చేసేది లేక పంటను పొలం లోనే వదిలేశారు. ప్రస్తుతం చిన్న బళ్లారి రకం ఉల్లి సాగు చేసిన రైతులు వర్షాలకు పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ వేసిన రైతుల పొలాల్లో నీరు నిలబడి పైరు కుచించుకుపోతోంది. పసుపు వేసిన రైతుల్లో సైతం వర్షం గుబులు పట్టిస్తోంది. అక్కడక్కడ కాడ తెగుళ్లు సోకుతుండడంతో ఆందోళన రేకెత్తిస్తోంది. కాన గూడూరు, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో పూలతోటలు పాడైపోయా యని రైతులు వాపోతున్నారు. ఇక మొక్కజొన్న దిగుబడులు రోడ్ల పక్కలో ఆరబెట్టిన రైతుల పరిస్థితి సరేసరి. కుప్పల్లో నీరు నిలువడంతో వాటిని తొలగించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

మిషన్‌తో వరి కోత కోస్తున్న దృశ్యం



వరి రైతుల్లో ఆందోళన

● వర్షం భయంతో ముమ్మరంగా వరి కోతలు

వరిధాన్యం బస్తాలను లారీకి నింపుతున్న కూలీలు



జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షం భయంతో పండిన పంట ఎక్కడ దెబ్బతింటుందోననే ఆందోళనతో రైతులు గ్రామాల్లో వరి కోతలు మొదలు పెట్టారు. జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం, దానవులపాడు, గొరిగెనూరు, చలివెందుల, పెద్ద దండ్లూరు, పి.సుగుమంచిపల్లె, అంబవరం, గూడెం చెరువు, అనంతగిరి, పూర్వపు బొమ్మేపల్లె తదితర గ్రామాల్లో ప్రతి ఏడాది రైతులు అధికంగా వరి పంట సాగు చేస్తారు. ధర్మాపురం తదితర గ్రామాల్లో ఇటీవల తుఫాను వలన వరి పంట నేలవాలి దెబ్బతింది. ప్రస్తుతం వర్షం భయంతో చేతికొచ్చిన పంట దెబ్బతింటుందోననే ఆందోళనతో రైతులు మిషన్లతో కోతలు ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో వరి కోతలు ఊపందుకున్నాయి. కాగా, పంట సాగు చేయడానికి ఎకరాకు రూ.35 వేలు ఖర్చు చేశామని, ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధర లేదని ఓ రైతు వాపోయాడు. ఎకరాకు 38 బస్తాల నుంచి 42 బస్తాల వరకు వరి దిగుబడి వస్తోందన్నారు. ప్రస్తుతం వరి ధాన్యం 78 కేజీల బస్తా రూ.1400, పుట్టి (10 బస్తాలు) రూ.12వేలతో వ్యాపారస్థులకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సాగు కోసం చేసిన పెట్టుబడి, ఖర్చులు అన్ని కలిపితే కష్టాలు తప్ప పెద్దగా మిగలడం లేదంటున్నారు. ప్రభుత్వం గిట్టు బాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

వెల్లాల సంజీవరాయ దేవస్థానానికి భారీ విరాళం



ఆలయ చైర్మన్‌కు విరాళం అందిస్తున్న తిరుపాల్‌రెడ్డి

రాజుపాలెం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానానికి మంగళవారం మైలవరం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన భూపతి తిరుపాల్‌రెడ్డి రూ.లక్షా 5వేలు విరాళం అందజేశారు. నూతనంగా ఆలయం నిర్మిస్తుండడంతో దాతలు విరాళాలు అందిస్తున్నారని ఉత్సవ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా సంజీవరాయస్వామి సన్నిధిలో దాతను పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో పూజారులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలు దారుణం

ఎర్రగుంట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలు దారుణమని ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న పూస సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుపతిలో మంగళవారం జరిగిన సభకు ఆయన హాజరై ప్రసం గించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయ త్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భవిషత్తులో ప్రజలపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. విద్యుత్ చార్జీలు పెరిగి వినియోగదారులకు అత్యంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

వాల్మీకులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రొద్దుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాల కోసం రుణాలను మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ 3 లో భాగంగా 56 కులవృత్తులతో పాటు వాల్మీకులకు కూడా రుణాలు మంజూరు చేయాలని వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశంలో వాల్మీకులకు రుణాల మంజూరుపై చర్చించినట్లు తెలిపారు. గతంలో వాల్మీకులకు కులవృత్తి కారణంగా రుణలు మంజూరు చేయలేదన్నారు. వాల్మీకులు వడ్రంగి, వడ్డెర, తదితర వృత్తులలో వున్నారన్నారు. ఈ అంశంపై మంత్రి సవిత స్పందించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారని నాగరాజు వెల్లడించారు.

గూడ్స్ రైలుకింద పడి వ్యక్తి మృతి



కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని కనుమలోపల్లి వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు బ్లూకలర్ చొక్కాపై తెలుపు రంగు గీతలు కలిగిన ఫుల్ షర్టు ధరించి ఉన్నాడు. నలుపు రంగు కలిగిన ఫార్మల్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ 9440900811, సీఐ 9440627398 కు ఫోనుచేసి తెలపాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పులివెందుల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో షార్ట్‌సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఫైర్‌స్టేషన్ అధికారుల వివరాల మేరకు మంగళవారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో తమకు సమాచారం అందడంతో అగ్నిమాపక వాహనంతో వెళ్లి మంటలు వ్యాపించిన దుకాణాలను ఆర్పివేశామన్నారు. ఈ ప్రమాదంలో ప్రసాద్ అనే వ్యక్తికి చెందిన ఫర్నీచర్ దుకాణంలోని సామాగ్రి కాలిపోయి రూ.10లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడన్నారు. అలాగే ఫర్నీచర్ షాప్ పక్కనే ఉన్న ఫర్టిలైజర్ దుకాణానికి కూడా మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న మందులు, ఇతర సామాగ్రి కాలిపోయి రూ.15లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు యశస్విని తెలిపారన్నారు.

కుప్పగుట్టపల్లెలో వ్యక్తి ఆత్మహత్య



మల్లికార్జున (ఫైల్)

చక్రాయపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం కుప్పగుట్టపల్లెలో పెద్దపోయిన మల్లికార్జున (49) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు వివరాలిలా.. మల్లికార్జున జీపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అదే సమయంలో వేంపల్లె నుంచి కుప్పగుట్టపల్లెకు మల్లికార్జున జీపులో వెళుతూ హోంగార్డులు నాగరాజు, నరసింహరాజులను ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో గాయపడ్డ వారిని కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై పోలీసులు ఆరా తీయడడంతో మల్లికార్జున భయపడి మంగళవారం ఉదయం విషద్రావణం తాగాడు. వెంటనే అతన్ని రాయచోటిలోని ఓ వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీనిపై చక్రాయపేట ఎస్ఐ వివరణ కోరగా.. పోలీసులకు భయపడి చనిపోలేదన్నారు. కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పోస్టుమార్టం చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా మల్లి కార్జునకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు.

స్కూటర్, కారు ఢీ - ఒకరి మృతి

ఖాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట-కమలాపురం రహదారిలోని సుంకేసుల వద్ద కారు ఢీకొన్న సంఘటనలో వెంకటరెడ్డి (63) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు సోమవారం సాయంత్రం పని నిమిత్తం సుంకేసులకు చెందిన వెంకటరెడ్డి రహదారిలో వస్తుండగా ఖాజీపేట నుంచి కమలాపురం వెళుతున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

మైదుకూరు నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం జీవీ సత్రంలోని సీతారామయ్య నగర్‌లో మంగళవారం బెల్టుషాపు నడుపుతున్నా రన్న సమాచారం రావడంతో దాడి చేసి నిర్వాహకుడు వంగా సీతారామయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. అతని వద్ద నుంచి 9 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భారీ స్కోర్ దిశగా అనంతపురం, నెల్లూరు జట్లు





ఏసీఏ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు, 102 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్న మోక్షజ్ఞతేజ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మంగళ వారం ఆట ముగిసే సమయానికి అనంత పురం జట్టు కర్నూలు జట్టుపై భారీ స్కోర్ దిశగా సాగుతోంది. అలాగే నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు అదే దారిలో సాగుతోంది. వివరాలిలా.......

కడప నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 45 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 174 పరుగులు చేసింది. ఇందులో ముఖేష్‌మోక్షజ్ఞతేజ్ 102 పరుగులతో, హేమచందర్‌నాయక్ 59 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

నగర రిమ్స్ సమీప వైయస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 51.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. ఇందులో కిన్నుకిషల్ 77 పరుగులు చేశారు. మరో బ్యాటర్ ఎస్‌కె షామీర్ 26 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

మట్టినమూనాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కొండాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం మట్టినమూనాలపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మట్టి నమూనాలు మరియు భూసారపరీక్షల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కడప భూసార పరీక్షా కేంద్రం ఏవోలు సాయిజ్యోతి, భారతి, పద్మజలు మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకాన్ని ఎలా వినియో గించుకో వాలో విద్యార్థులకు వివరించారు. ఏవో ఏవీ రామాంజు లరెడ్డి, గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మాధవి పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన రెడ్డిబాబు అనే వ్యక్తి మంగళవారం బాలిక ఇంటి దగ్గరకి వచ్చి, ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో ఆ లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజె క్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం నీటిని నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 100 క్యూసెక్కులు, వరద నీరు 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.534 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

8న సీబీఐటీ విద్యార్థులకు పేస్ ఎక్సరేషన్ మిషన్

చాపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీబీఐటీ విద్యార్థులకు ఈనెల 8వ తేదీ పేస్ ఎక్సరేషన్ 2025 మిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రయోగాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. 35 మంది విద్యార్థులతో కూడిన డైనమిక్ గ్రూపు 35 కి.మీ. ఎత్తులో ఉండే స్ట్రాటో ఆవరణంలోకి రాకెట్ ప్రయోగంపై శాస్త్రీయ పేలోడ్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వాతావరణం, ఉష్ణోగ్రత, తేమ పీడనం, యూవీ రేడియేషన్, వీపీఎస్ వంటివాటిపై బోధించడం, ప్రయోగాలు నేర్పించడం జరుగుతుందన్నారు.

రోగులకు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలి

● ఆర్ఎంపీలకు ఆర్డీఓ, వైద్య అధికారుల ఆదేశాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య, పక్కన డిప్యూటీ డీఎంహెచ్ఓ

పులివెందుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీరు ఎంబీబీఎస్ చదవలేదు.. ఆసుపత్రుల్లో పని నేర్చుకొని వచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రం అని ఏర్పాటు చేసుకున్నారు.. మీరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగులకు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొహిద్దీన్, డీఈఎంఓ భారతిలు ఆర్ఎంపీలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పులివెందుల, వేంపల్లెలోని ఆర్ఎంపీలకు (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రాలలో ఇంజక్షన్లు, మందులు, మాత్రలు ఇవ్వకూడదన్నారు. మంచాలు, ఐవీ స్టాండ్స్, ఆసుపత్రికి సంబంధించిన పరికరాలు ఉండరాదన్నారు. ఆక్సిజన్ నెబులైజర్ ఉపయోగించకూడదన్నారు. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలలో ప్రథమ చికిత్స గాయాలకు కట్టు కట్టుట, వ్యాధులు రాకుండా సలహాలు, సూచనలు, చికిత్సకు వెళ్లాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిని సూచించడం జరుగుతుందనే బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రథమ చికిత్స కేంద్రాల పర్యవేక్షణకు నోడల్ అధికారులు ఉంటారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఆర్ఎంపీలు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవచేస్తున్నారనే కోవలో ఎందుకు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో తప్పు జరిగితే అది అందరిపై రుద్దడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ నిబంధ నలకు లోబడి తాము ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని, తమపై దయతలచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రమణ, హెచ్ఈఓ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు అన్ని ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ● దర్గా పరిసరాలు శుభ్రంగా ఉంచాలి : కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దదర్గా (అమీన్‌పీర్ దర్గా) ఉరుసు మహోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సమర్థవంతంగా అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్. మాధవి, జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులకు సూచించారు. ఆ మేరకు మంగళవారం పెద్దదర్గా ఉరుసు మహోత్సవాల నిర్వహణ, భద్రత, ప్రజా సౌకర్యాల ఏర్పాట్లపై దర్గా ఆవరణంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలకు అధిక సంఖ్యలో ప్రజలు, భక్తులు హాజరవుతారన్నారు. ప్రధానంగా ఆరోగ్య సమస్యలు, ట్రాఫిక్, విద్యుత్, శానిటేషన్, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరమంతా విద్యుత్ దీపాలతో అలంకరింప చేయాలని సూచించారు. సమీక్ష కార్యక్రమంలో మునిసిపల్, ఆరోగ్య, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, దర్గా ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

దర్గా పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దర్గా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మంగళవారం కడప నగరం నార్త్‌జోన్ పరిధిలో పలు ప్రాంతాలను సందర్శించారు. అమీన్‌పీర్ పెద్దదర్గా వద్ద నిర్వహించిన విజిట్‌లో పాల్గొన్నారు. దర్గా నిర్వహిస్తున్న ఉర్సే షరీఫ్ పండుగకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. దర్గా చుట్టుపక్కల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని,రోడ్లపైఎలాంటి గుంతలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్, ఎంహెచ్ఓ, డీఈ, ఏఈ, ఎస్ఐలతో పాటు దర్గా పీఠాధిపతులు పాల్గొన్నారు.

అనంతరం కమిషనర్ సంధ్య సర్కిల్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను కూడా సందర్శించారు. క్యాంటీన్ లోపల ఎప్పటికప్పుడు శుభ్రతను పాటించాలని, భోజనానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆయన సూచించారు.

నేడు కార్తీక పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. మండల పరిధిలోని సంగమేశ్వర ఆలయం, భీమేశ్వరాలయం, శివకృష్ణ ఆలయం, కాశిరెడ్డినాయన ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు. అలాగే సాయంత్రం సంగమేశ్వర ఆలయంలో జ్వాలాతోరణం చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతం

కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా నగరంలోని రామచంద్రయ్య కాలనీ (ఇండస్ట్రియల్ ఎస్టేట్) లో వెలసిన అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రంలో బుధవారం ఉదయం 12 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం జరుగనున్నట్లు ఆ ఆలయ సంస్థాపకుడు గుండ్లూరి నారాయణరావు తెలిపారు. తొలుత క్షేత్రంలో వెలసిన అన్నపూర్ణాదేవి, జ్ఞానేశ్వరులకు విశేష పూజలు జరుగనున్నాయన్నారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి ప్రసాద వినియోగం ప్రారంభమౌతుందన్నారు. భక్తులు కుటుంబసమేతంగా హాజరై స్వామి, అమ్మవారి అనుగ్రహం పొంది కార్తీక వన భోజన చేయాలని కోరారు.

రామాపురంలో రేపు కోటి మహాదీపోత్సవం

కమలాపురం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామాపురంలో వెలిసిన మోక్షనారాయణ స్వామి ఆలయంలో 6వతేదీన కోటి మహాదీప ఉత్సవం అత్యంత వైభవంగా జరగనున్నట్లు ఆలయ ప్రధాన సేవకుడు, పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాశీభట్ల సత్యసాయినాథశర్మ తెలిపారు. భక్తులకు అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

9న ఇసుకలో దిద్దిన అ..ఆ..లు పుస్తకావిష్కరణ

కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత తెలుగు పండితులు విద్వాన్ ఎస్.సుబ్బరాయుడు రచించిన ఇసుకలో దిద్దిన అ...ఆ...లు అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలోని బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరం నందు జరుగనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. సభాధ్యక్షుడుగా వైవీయూ తెలుగు శాఖ ఆచార్యులు, కవి, ఎన్. ఈశ్వర్‌రెడ్డి, పుస్తక సమీక్షకుడుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి వ్యవహరించనున్నారన్నారు. సాహితీ ప్రియులు తప్పక హాజరై పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు భద్రంపల్లెలో ఆలయాలకు భూమిపూజ

పులివెందుల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రపల్లె గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించనున్న శ్రీరాముడు, గంగమ్మ ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) హాజరవుతారని, విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు.

విచక్షణారహితంగా ఎరువులు వాడవద్దు

పులివెందుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విచక్షణారహితంగా ఎరువులు వాడకం ద్వారా మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడిందని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో భూమాత సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఎరువుల వినియోగాన్ని అవసరమైన మేరకు మాత్రమే ప్రోత్సహించే దిశగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు చెన్నారెడ్డి, రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి'

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ అబ్జర్వర్లు, డివిజన్ అబ్జర్వర్లు, డివిజన్ పరిశీలకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్వయంగా అంజాద్‌బాష అధ్యక్షత వహించారు. అలాగే కడపలోని 47వ డివిజన్‌లో కార్పొరేటర్ పాకా సురేష్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.


వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం



మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్మన్ రాఘవరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం మార్కెట్‌యార్డును రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డుగా మార్పు చేస్తున్నట్లు కమలాపురం మార్కెట్‌యార్డు చైర్మన్ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కమలాపురం ఆధ్వర్యంలో సాధారణ సమావేశం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య రెడ్డి, కలెక్టరు సూచనల మేరకు కమలాపురం మార్కెట్ యార్డును రెగ్యులేటెడ్ మార్కెట్‌యార్డుగా మార్చేప్రతిపాదనపై సమావేశంలో నిర్ణయించామన్నారు. ఈ క్రమంలో ఎర్రగడ్డలు, మినుములు, నువ్వులు, ధాన్యాల కొనుగోలు,అమ్మకాలు సులభంగా జరిగే విధంగా జంబో షెడ్డు నిర్మించేందుకు ఈ సమావేశంలో తీర్మాణాలు ఆమోదించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఆజాద్‌వలి, ఇన్‌ఛార్జ్ ఏడీఏ ఆర్.నాగభూషణ్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి రెడ్డయ్య, కార్యదర్శి ఎన్.వరప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోకి డ్రైనేజీ నీరు



కమలాపురం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బస్టాండు సమీపంలోని ఎంపీపీ ప్రధాన పాఠశాలలోని విద్యార్థులు మురుగునీటితో విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి నీరు నిలిచింది. దీనికి తోడు పాఠశాల పక్కనే ఉన్న డ్రైనేజీ నుంచి మురుగునీరు పాఠశాలలోకి చేరడంతో దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కమలాపురం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలకు లాభదాయకం చేకూరుతుందని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం టి.చదిపిరాళ్ల,రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు ఇన్‌ఛార్జ్ నాగభూషణంరెడ్డి, ఉద్యాన అధికారి రెడ్డప్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామ వ్యవసాయసహాయకుడు సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పద్ధతులు మార్చుకోండి.. లేదంటే తాటతీస్తా

● రౌడీషీటర్లకు చిన్నచౌకు సీఐ ఓబులేసు వార్నింగ్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న చిన్నచౌకు సీఐ ఓబులేసు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పద్ధతులు మార్చుకోకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని, ఎవరు కూడా గొడవలకు పోకూడదని చిన్నచౌకు సీఐ ఓబులేసు హెచ్చరించారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్లకు ట్రబుల్‌మాంగర్స్‌కు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించారు. ఎక్కడా కూడా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. మీ అందరి ఫోన్లు ట్రాకింగ్‌లో ఉన్నాయని గొడవలు సృష్టించినట్లు తమ దృష్టికి వస్తే తాట తీస్తామని వార్నింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వారి వివరాలన్నీ కూడా పోలీసుస్టేషన్‌లో ఇస్తుండాలని అన్నారు. కడపలో జరుగుతున్న ఉరుసు రీత్యా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని అన్నారు. కౌన్సిలింగ్‌లో చిన్నచౌకు ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి..: ప్రజలకు చట్టాలపై, ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ప్రమాదాలు, నేరాలు జరగవని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పోలీసులు మంగళవారం సాయంత్రం ప్రజలకు వాహనదారులకు నూతన బీఎస్ఎస్ చట్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులపై బీఎస్ఎస్ చట్టంపై అవగాహన కల్పించారు.

మహాలక్ష్మీదేవిగా గౌరీదేవి



వేంపల్లె, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంగంవీధిలో వెలసిన గౌరీదేవి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. బలిజసంఘం ఆధ్వర్యంలో గౌరీదేవికార్తీక వేడుకలు నాలుగు రోజులుగా కన్నులపండువగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి అమ్మవారిని మహాలక్ష్మీదేవి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందు కున్నారు. బలిజ సంఘం అధ్యక్షుడునంబూరు కుళాయప్ప, కటికచంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య,రంగయ్యపాలక మండలి సభ్యులు రామచంద్ర, నిత్య, యడాలరామ తదితరులుపాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు రాహుకాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు భక్తులు పూజలు నిర్వహించారు.

నేడు అమ్మవారికి విశేష అభిషేకం..: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం వేకువజామున అమ్మవారికి నవకలశ స్నపనం (విశేష అభిషేకం), సహస్రలింగార్చన, చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

విద్యాదాత కందుల శివానందరెడ్డి



శివానందరెడ్డికి నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ కందుల శివానందరెడ్డి విద్యాదాతగా పేద విద్యార్థుల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం కళాశాల ఆవరణలో మంగళవారం కందుల శివానందరెడ్డి 5 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, కంటివైద్య శిబిరం నిర్వహించారు. 2022, 2023, 2024లో మొదటిస్థానం మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరప్రసాద్, కళాశాల చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కందుల కుటుంబీకులు, విద్యార్థులు పాల్గొని ఘన నివాళి అర్పించారు.

ఘనంగా ఆస్థాన-ఏ మురాదియ దర్గా ఉరుసు



కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మురాదియ నగర్‌లో వెలసిన ఆస్థాన ఏ మురాదియ దర్గా 137వ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆ దర్గాలో నిర్వహించిన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాష సాహెబ్ దర్గాలో పూలచాదర్లను సమర్పించి ఫాతెహా చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులతో పాటుగా భక్తులు పాలొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై చైతన్యవంతులను చేయాలి : ఏడీఏ

పులివెందుల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను చైతన్యవంతులను చేయాలని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఐజీకార్ల్‌లోని వ్యవసాయకళాశాలలో ఐసీఆర్పీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం డీపీఎం ప్రవీణ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయం విధివిధానాలు, ఐసీఆర్పీ విధుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేశ్, ఉష, మనోజ్, శిక్షకులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష తప్పనిసరి


సీకేదిన్నె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో సుచిత్ర తెలిపారు. మండలంలోని ఇప్పెంట, అగ్రహారాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏవో ఈశ్వర్‌రెడ్డి, రైతులు, స్థానిక ఉద్యాన అధికారి శిల్ప, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి భూమాత రుణం తీర్చుకుందాం

పులివెందుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి భూమాత రుణం తీర్చుకుందామని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య విద్యార్థులతో అన్నారు. మంగళవారం స్థానిక ఇస్లాంపురం జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్‌లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనంపై ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కోటిరెడ్డి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి మార్గదర్శకత్వంలో విద్యార్థినులు పాల్గొని, కాలుష్యనియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వలంటీర్లు నాగరాజుపేట కాలనీలో పూల మొక్కలనుపంపిణీ చేయడమే కాకుండా, మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో కూడా మొక్కలు నాటారు.



మొక్కలు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష

ముంపు ప్రాంతాలుగా ప్రకటించండి

● కలెక్టర్‌కు శెట్టివారిపల్లె, కోడిగాండ్లపల్లె గ్రామాల ప్రజల వినతి

ముద్దనూరు నవంబరు4(ఆంధ్రజ్యోతి):గండికోట బ్యాక్ వాటర్ ప్రాంతంలోని శెట్టివారిపల్లె, కోడిగాండ్లపల్లె గ్రామాలను ముంపు గ్రామాలు గా ప్రకటించాలని ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కోరారు. మంగళ వారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పలు సమస్యలు వారికి విన్నవించుకున్నారు. శెట్టివారిపల్లె సమీపంలో గండికోట బ్యాక్ వాటర్ వల్ల సమస్యగా ఉందని, గ్రామం కూడా కొండప్రాంతంలో ఉండడంతో కనీస వసతులులేవన్నారు. వర్షాలు పడితే వంతెన మట్టి ఉల్లిపడిపోతుందని, కారణంగా రాకపోకలు కూడా ఉండవన్నారు. కొండప్రాంతంలో చిరుతల సంచారం ఉందని, దాదాపు 200 కుటుంబాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు వచ్చాయని, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. .అలాగే కోడిగాండ్లపల్లె వాసులు బ్యాక్ వాటర్ గ్రామానికి అతి సమీపంలో ఉండటం వల్ల విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చిన్న పిల్లలు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. 250 భూమిలో 200ఎకరాలు గండికోట ప్రాజెక్టుకు త్యాగం చేశామని, ప్రస్తుతం 50 ఎకరాలు మాత్రమే ఉందని బతుకు దెరువులేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.ప్రభుత్వానికి నివేదిక అందజేసి తగున్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఓబుళరెడ్డి,లక్ష్మినారాయణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



శెట్టివారిపల్లెలో కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి సమస్యలు విన్నవించుకుంటున్న ప్రజలు

డిగ్రీ కళాశాలకు బి-గ్రేడ్ అవార్డు

జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ-గ్రేడ్ అవార్డు లభించింది. మంగళవారం ఈ అవార్డు రావడంతో కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అధ్యాపక బృందం కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలను ఆహ్వానించి కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కళాశాలకు అవార్డు రావడంతో ఇంకా బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంజీవరెడ్డి, షఫి, సుబ్బరామిరెడ్డి, సుదర్శన్, బాలు, శివరాం, వెంకటేష్, పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన పెంచుకోవాలి

జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ పేర్కొన్నారు. జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం ప్రధాన రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువను ఆమె పరిశీలించి వ్యర్థాలను తొలగించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కాలువ పక్కనే వ్యర్థాలు వేయకుండా నేరుగా ట్రాక్టరులో తీసుకుని గ్రామ శివార్లలో పడవేయాలని తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి మోరగుడిలో చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం జరుగనుండడంతో గ్రామంలో పారిశుధ్య చర్యలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్ కొండయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేకలకుంట పంచాయతీ అభివృద్ధిపై సమీక్ష

బ్రహ్మంగారిమఠం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రేకలకుంట గ్రామ పంచాయతీ అభివృద్ధిపై గ్రామ ప్రజలతో ఎంపీడీవో వైరామచంద్రారెడ్డి సమావేశమై చర్చించారు. మొదట పంచాయతీలో వెనుకబడి ఉన్న చీకటివారిపల్లె, బాలాజీనగర్, వాంపల్లె చెరువు, టిరామాపురం, జెడ్‌కొత్తపల్లె, రేకలకుంట గ్రామాలను సందర్శించారు. గ్రామంలో ప్రజలకు కావాల్సిన తాగునీరు., వీధిలైట్లు, రోడ్లు, విద్యార్థులకు పాఠశాలలు వంటి మౌలిక వసతలు పరిశీలించారు. అనంతరం గ్రామ ప్రజలతో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రోడ్లు, వీధిలైట్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత కాణాల మల్లిఖార్జునరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూసేకరణ బాధితులకు పరిహారం చెల్లించాం

ప్రొద్దుటూరు , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మోడంపల్లె బైపాస్ రోడ్డు విస్తరణలో భాగంగా బాధితులకు నష్ట పరిహారం చెల్లించామని తహసీల్దారు గంగయ్య, తెలిపారు. ఓ ప్రైవేటు భవనంను ఆర్‌అండ్‌బీ అధికారులు కూల్చడానికి ప్రయత్నిస్తే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అడ్డుకున్నారు. దీంతో మంగళవారం రోడ్డు విస్తరణ పనుల వద్దకు వెళ్లి నోటీసులు ఇవ్వకుండా భవనం కూల్చడం రాజకీయ కక్ష సాధింపుగా రాచమల్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా తహసీల్దారు గంగయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, డీఈ లక్ష్మీనరసింహులు, మున్సిపల్‌టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగరాజులు మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణకు ఎప్పుడో డబ్బులు కచెల్లించారని అందువల్ల నోటీసులు ఇవ్వవలసిన అవసరం లేదని తెలిపారు. చట్టప్రకారం రోడ్డు విస్తరణ చేపడితే తాను సహకరిస్తానని రాజకీయ కక్ష సాధింపుకు పాల్పడితే మాత్రం తప్పనిసరి అడ్డుకోని తీరుతానని రాచమల్లు అన్నారు.ఈ విషయంపై ఆర్డీవో సాయిశ్రీతో రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్చించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బద్వేలుటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వధ్యేయమని ఆర్డీవో చంద్రమోహన్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుప్రజ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి మార్కెట్‌యార్డులో నూతనంగా నిర్మిస్తున్న రైతుబ జారును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నేరుగా ప్రజలకు చేరవేసేందుకు రైతుబజారును నూతనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో కూటమి నేత బొజ్జ రోశన్న, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ప్రతాప్ కుమార్, సురేంద్ర, మస్తాన్ బాబు, సుబ్బారావు, విజయ్‌కుమార్, సాధనకారి రంతు పాల్గొన్నారు.



రైతుబజారును పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్ , టీడీపీ నేత రితేష్‌రెడ్డి

మార్కెట్‌యార్డుకు నిధులు కేటాయించాలి

ఎర్రగుంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మార్కెట్‌యార్డు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని చైర్మన్ ఆర్.నాగరాజు కలెక్టర్ చెకుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డిలను కోరారు. ఆమేరకు మంగళవారం వారికి వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాలొస్తే యార్డు అంతా నీటితో నిండుతోం దన్నారు. శనగ, ఉల్లి పంటలను ఆరబెట్టుకునేందకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయ న్నారు. మార్కెట్ యార్డును అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

విధుల నుంచి వీహెచ్‌ఏ తొలగింపు

ఖాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావులపల్లె పంచాయతీలో పనిచేస్తున్న వీహెచ్‌ఏ సురేంద్రను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో దివిజాసంపతి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గత పది నెలలుగా విధులకు సక్రమంగా రాకపోవడంతో రైతులను ఇబ్బందులకు గురిచేయడంతో డీహెచ్‌వో ఫిర్యాదు మేరకు తొలగించారని, పూర్తి బాధ్యతలు వేరేవారికి అప్పగించేంతవరకు సురేంద్ర అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు.

తెలుగుగంగ కాల్వపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మంగనపల్లె పంట పొలాలకు వెళ్లేందుకు తెలుగుగంగ కాల్వపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, కేశవ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మంగనపల్లె గ్రామం సందర్శించారు. పోరుమామిళ్ల పెద్ద చెరువు నుంచి నీళ్లు వచ్చినప్పుడల్లా పైపులు, గ్రావెల్ కొట్టుకునిపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా తెలుగు గంగ కాల్వకు బ్రిడ్జి నిర్మించి దారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

క్యాంటీన్ అక్రమ అనుమతులపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం

ప్రొద్దుటూరు , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ స్థలం లో అక్రమంగా రాచమల్లు వారి రాజన్న క్యాంటీన్ కు అప్పటి కమిషనర్ రమణయ్య ఏసీపీ మునిరత్నంలపై అనుమతులు ఇవ్వడంపై చర్యలకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆమేరకు జీవో నెంబరు 1221 మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ బాబు ఉత్తర్వులు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ స్థలం వేలం పాటలు నిర్వహించకుండా నెలబాడుగకు లీజు కివ్వడంపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మున్సిపల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఏసీబీ అధికారులు సైతం విచారణ జరిపారు. వారి నివేదిక మేరకు నాటి కమిషనర్ పత్తిపాటి వెంకట రమణయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నంలు 15 రోజుల్లోపు లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని లేకుంటే చార్జ్ మెమోలు జారీ చేయబడు నని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సిద్ధం కావాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బద్వేలు/ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాబోవు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి బీజేపీ కార్యకర్తలందరూ సిద్ధం కావాలని బీజేవైఎం జిల్లా ప్రదాన కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 24వ వార్డు వెంకటయ్యనగర్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం పట్టణ బీజేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలోని అన్ని వార్డుల పోలింగ్ బూత్ అధ్యక్షులు మరియు శక్తి కేంద్రాల ప్రముఖులను తక్షణమే నియమించాలన్నారు. అనంతరం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్నా కార్యకర్తలకు మేము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బద్వేలుటౌన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రాయల్, ఉపాధ్యక్షురాలు కటారి కిరణ్‌కుమారి, వీరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కుమార్, పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పోరుమామిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పోరుమామిళ్ల బీజేపీ మండల అధ్యక్షుడు నారిశెట్టి నాగేంద్ర అధ్యక్షతన మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బద్వేలు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ పాల్గొన్నారు. మండలంలో 17 పంచాయతీల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు .శక్తికేంద్రాలు పోలింగ్ బూత్ కమిటీలు మండల కమిటీ సభ్యులందరూ పాల్గొని సభ్యత్వ నమోదు చేయించారు. క్రియాశీలక సభ్యులుగా 30 మందిని మండలంలో ప్రతి పంచాయతీకి పార్టీని విస్తరింజేయడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఓబీసీ నాయకుడు రమణాచారి, అసెంబ్లీ కోకన్వీనరు పండరి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కేతవరం వద్ద బ్రిడ్జి నిర్మించాలని వినతి

చాపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే అధికారులు కేతవరం వద్ద బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకుడు నారపురెడ్డి, గ్రామస్థులు మంగళవారం కడపలోని పీడీ అశోక్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కేతవరం గ్రామం నుంచి అల్లాడుపల్లె దేవాలయం వరకు రస్తా ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు గ్రామస్థులు వ్యవసాయ పనులకు పంట ఉత్పత్తులు ఇళ్లకు ట్రాక్టర్లలో తీసుకొచ్చేందుకు ఈ రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై నేషనల్ హైవేను నిర్మిస్తున్నారని 20 అడుగుల వెడల్పు, 16 అడుగుల ఎత్తులో నిర్మిస్తే రాకపోకలకు అనుకూలంగా ఉంటుందన్నారు.

'వైద్యవిద్యకు పీపీపీ విధానం సరికాదు'

కాశినాయన నవంబరు4(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తామనడం సరైందికాదని వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమగంపల్లెలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరెంట్ రమణారెడ్డి, నాయకులు హనుమంత్‌రెడ్డి, సురేష్, క్రిష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టండి

పోరుమామిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :బాల్యవివాహాలను అరికట్టాలని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఓఎల్‌ఎఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఈవ్‌టీజింగ్, డయల్ 100 , పోక్సో ట్రాఫిక్ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవాలని డీఎస్పీ పి.భావన పేర్కొన్నారు. మంగళవారం గోల్డెన్ పార్కులో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ చెకుముఖి ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సైన్స్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, నాయకులు సునీత రాజశేఖర్, మురళీగుప్త, రాజేష్, రాజ్యలక్ష్మి, గోపీనాథరెడ్డి, సుందరమ్మ, శిరీష, వెంకట్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయిలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డేవిడ్‌రాజు, పట్టణాధ్యక్షుడు రాఘవేంద్ర, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్పదీక్షాపరులకు అన్నదానం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :రజక అన్నదాన సత్రంలో అయ్యప్పదీక్షాపరులకు స్థానిక నాయకుడు ఆవుల దస్తగిరినాయుడు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి ఆకుల శివకుమారస్వామి మాట్లాడుతూ ఎవరైనా అయ్యప్పదీక్షాపరులకు అల్పాహారం , బిక్ష ఏర్పాటు చేయాలనుకుంటున్నారో వారు తమను సంప్రదంచాలని తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టిపెట్టండి

కలసపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిపెట్టి వ్యాధులు ప్రబలకుండా చూడాలని వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళశారం ఆరోగ్యకేంద్రంలో జరిగిన ఆశాడే కార్యక్రమంలో వారుసిబ్బందికి పలు సూచనలు, సలహాలుఇచ్చారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భోజనాన్ని నాణ్యతగా అందించాలి

ఎర్రగుంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని నాణ్యతతో అమలు చేయాలని ఎంపీడీవో నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం తుమ్మలపల్లెలో మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆయన భోజనం వడ్డించారు.

